

వనం..మనం.. మనఊరి కోసం

RNI/APTEL/26/A3829

ప్రభ మనం

TELUGU DAILY తెలుగు డైలీ

Gmail: prabhamanam@gmail.com



విలేకరులు కావలెను.
WANTED... WANTED...
ఆంధ్ర, తెలంగాణ నుండి వెలువడుతున్న తెలుగు జాతీయ దినపత్రిక ప్రభ మనం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు, ఆర్సీ ఇంచార్జీలు,సిసి ఇంచార్జీలు మరియు మండల విలేకరులు కావలెను. ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి.
ఎడిటర్: వి. లింగమూర్తి
9000367833, 8074937223



కర్నూలు : ఎడిటర్ - వడ్డే లింగమూర్తి | సంపుటి : 1 సంచిక : 31 | పేజీలు : 4 వెల రూ./-4 | email: prabhamanam@gmail.com | శుక్రవారం 19-06-2026


# తమిళ రాజకీయాల్లో కీలక మలుపు

సీఎం విజయ్‌కు దగ్గరవుతున్న వైగో!

- డీఎంకే నేతృత్వంలోని కూటమి నుంచి వైదొలగనున్న ఎండీఎంకే
- సీఎం విజయ్ సారథ్యంలోని టీవీకే ప్రభుత్వానికి దగ్గరయ్యేందుకు సన్నాహాలు
- డీఎంకే గుర్తుపై గెలవడంతో ఎమ్మెల్యేల రాజీనామా అంశంపై పార్టీలో చర్చ
- జూన్ 27న పార్టీ జనరల్ కౌన్సిల్ సమావేశంలో తుది నిర్ణయం
- విజయ్ ప్రభుత్వానికి మద్దతుగా మాట్లాడిన వైగో కుమారుడు దురై వైగో



తమిళనాడు రాజకీయాల్లో మరో కీలక పరిణామం చోటుచేసుకుంటోంది. సీనియర్ నేత వైగో నేతృత్వంలోని మరుమలార్చి ద్రావిడ మున్నేట్ర కజగం (ఎండీఎంకే) పార్టీ, అధికార డీఎంకే నేతృత్వంలోని సెక్యులర్ ప్రోగ్రెసివ్ అలయన్స్- మిగతా 2 లో

# జీ7లో సభ్యత్వం లేదు.. అయినా భారత్‌కు రెడ్ కార్పెట్ ఎందుకు?

- గ్లోబల్ సౌత్ గొంతుకగా భారత్‌కు గుర్తింపు
- ప్రపంచంలోనే అతిపెద్ద వినియోగదారుల మార్కెట్లలో ఒకటి
- చైనాకు చెక్ పెట్టగలిగే వ్యూహాత్మక భాగస్వామిగా భారత్‌కు గుర్తింపు
- వాతావరణ లక్ష్యాల్లో కీలక పాత్ర
- స్వతంత్ర విదేశాంగ విధానంతో ప్రత్యేకత




ఒకప్పుడు ప్రపంచ ఆర్థిక, రాజకీయ నిర్ణయాలపై పశ్చిమ దేశాలదే పైచేయి ఉండేది. ఇప్పుడు పరిస్థితి మారుతోంది. జీ7లో సభ్యదేశం కాకపోయినా.. భారత్‌కు ప్రతి ఏడాది ప్రత్యేక ఆహ్వానం అందడం వెనుక ఇదే కారణమని విశ్లేషకులు - మిగతా 2 లో

## విజయవాడ కస్టడీ డెత్: సీబీఐ విచారణ జరిపించాలి: వై.ఎస్. జగన్



- విజయవాడ కస్టడీ డెత్ కేసుపై సీబీఐ విచారణకు జగన్ డిమాండ్
- మే 9 నుంచి అదృశ్యమైన యువకుడు సాయికృష్ణ
- బాధిత కుటుంబాన్ని పరామర్శించి ప్రభుత్వ తీరుపై విమర్శలు

విజయవాడ కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలో 25 ఏళ్ల గాదె సాయికృష్ణ అనుమానాస్పద మృతిపై సీబీఐ - మిగతా 2 లో

## కోల్‌కతా వెళ్లిన నారా లోకేశ్

సీఎం సువేందు అధికారితో కీలక భేటీ



- పశ్చిమ బెంగాల్ సీఎం సువేందు అధికారిని కలిసిన ఏపీ మంత్రి లోకేశ్
- ఏపీలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, టెక్నాలజీ వినియోగాన్ని వివరించిన వైనం
- బెంగాల్‌లో టీటీడీ ఆలయ నిర్మాణానికి స్థలం కేటాయించాలని విజ్ఞప్తి
- మత్స్య సంపద ఎగుమతుల్లో పరస్పర సహకారంపై ఇరువురి మధ్య చర్చ
- లోకేశ్ ప్రతిపాదనలపై సానుకూలంగా స్పందించిన సువేందు అధికారి

ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్ మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేసే దిశగా కీలక సమావేశం - మిగతా 2 లో

## 'నాన్ సీరియస్ ప్లేయర్స్'కు

# ఏపీలో చోటులేదు

- రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి సమావేశంలో రూ. 30,515 కోట్ల పెట్టుబడులకు ఆమోదం
- ఈ ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రంలో సుమారు 30 వేల ఉద్యోగాలు రానున్నాయని అంచనా
- పారిశ్రామిక అభివృద్ధి ఫలాలు పేద, మధ్య తరగతికి చేర్చాలని సీఎం చంద్రబాబు ఆదేశం
- ఇథనాల్, సెమీ కండక్టర్ల పరిశ్రమలను ప్రోత్సహించాలని అధికారులకు దిశానిర్దేశం
- ప్రాజెక్టులు ప్రారంభించాకే ప్రోత్సాహకాలు ఇవ్వాలని మంత్రి లోకేశ్ స్పష్టీకరణ


2లో

పారిశ్రామిక అభివృద్ధి ఫలాలు రాష్ట్రంలోని పేద, మధ్య తరగతి ప్రజలకు చేరేలా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. గురువారం సచివాలయంలో ఆయన అధ్యక్షతన జరిగిన 18వ

## పాకిస్థాన్‌లో అంతా ఐఎస్ఐ పెత్తనమే

చట్టసభ నిర్ణయాలను ప్రభావితం చేశారు: పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్



- ఐఎస్ఐ గుప్పిట్లోనే పాక్ చట్ట సభలు నడిచాయన్న ఖవాజా ఆసిఫ్
- ఇమ్రాన్ ఖాన్ పాలనలోనే ఈ పరిస్థితి తలెత్తిందని వ్యాఖ్య
- ఏకంగా స్పీకర్ నివాసంలో అధికారిక సమావేశాల్లో పాల్గొనేవారని వెల్లడి

పాకిస్థాన్‌లో ప్రజాస్వామ్య పాలన అనేది కేవలం ఒక ప్రహసనమని.. అక్కడ తెరవెనుక అంతా సైన్యం, నిఘా సంస్థల మాటే నడుస్తుందని అంతర్జాతీయ సమాజం- మిగతా 2 లో

## భారత్-ఫ్రాన్స్ ఫుట్ బాల్ కనెక్షన్

# ప్రధాని మోదీ ఆసక్తికర వ్యాఖ్యలు


- భారత్, ఫ్రాన్స్‌ను ఫుట్‌బాల్ కలుపుతోందన్న ప్రధాని మోదీ
- పారిస్‌లో 'బొంజౌర్ మోదీ' కార్యక్రమంలో ప్రవాస భారతీయులతో భేటీ
- ఫిఫా వరల్డ్ కప్ 2026లో ఫ్రాన్స్ జట్టుకు శుభాకాంక్షలు
- జీ7 సదస్సులో పాల్గొనేందుకు ఫ్రాన్స్‌లో ప్రధాని పర్యటన


2లో

భారత్, ఫ్రాన్స్ దేశాల మధ్య ఫుట్‌బాల్ క్రీడ ఒక కీలకమైన సాంస్కృతిక వారధిగా నిలుస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభివర్ణించారు. పారిస్‌లో నిర్వహించిన 'బొంజౌర్ మోదీ' కార్యక్రమంలో

## పెట్రో ధరల తగ్గింపుపై ఆశలు

ఇప్పుడే కుదరదంటున్న కేంద్రం!



- తగ్గిన పశ్చిమాసియా ఉద్రిక్తతలు
- దీంతో దిగొచ్చిన ముడి చమురు ధరలు
- రిటైల్ ధరలూ తగ్గుతాయని ప్రజల ఆశాభావం
- వెంటనే సాధ్యం కాదన్న సురేశ్ గోపీ
- ముడి చమురు సరఫరాలో ఇంకా ఇబ్బందులు
- అవి సద్దుమణిగాకే ఇంధన ధరల్లో సవరణకు అవకాశం

అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు తగ్గినంత మాత్రాన దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు వెంటనే తగ్గవని కేంద్ర పెట్రోలియం, - మిగతా 2 లో

## డిజిటల్ బాటలో తెలంగాణ కేబినెట్ ఇకపై

# సమావేశాలు పూర్తిగా పేపర్‌లెస్


- తెలంగాణలో పేపర్‌లెస్ కేబినెట్ సమావేశాల ప్రారంభం
- మంత్రులకు ప్రత్యేక ట్యాబ్‌లు పంపిణీ చేసిన ప్రభుత్వం
- పారదర్శకత, పాలనా సామర్థ్యం పెంచడమే లక్ష్యం
- వ్యవస్థ పనితీరును స్వయంగా పరిశీలించిన సీఎం రేవంత్


2లో

తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర పరిపాలనలో మరో కీలక ముందడుగు వేసింది. మంత్రివర్గ సమావేశాలను ఇకపై పూర్తిస్థాయిలో 'పేపర్‌లెస్' (కాగితరహితం)గా నిర్వహించాలని నిర్ణయించింది. ఇందులో

## పవన్ కల్యాణ్‌కు బెంగళూరు కోర్టులో భారీ ఊరట


ఆ పోస్టులు తొలగించాలని ఆదేశం



- పవన్ కల్యాణ్‌కు బెంగళూరు కోర్టులో మధ్యంతర ఊరట
- భూకబ్జా ఆరోపణలపై దాఖలు చేసిన పరువు నష్టం దావా
- అవమానకరమైన పోస్టులను తొలగించాలని సోషల్ మీడియాకు ఆదేశం
- తెలంగాణలోని కోడి చెరువు భూములకు సంబంధించిన వివాదం

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌పై భూకబ్జా ఆరోపణలు చేస్తూ సోషల్ మీడియాలో - మిగతా 2 లో

## నేను జైల్లో ఉన్నప్పుడు బీఆర్ఎస్ ను బీజేపీలో విలీనం చేయాలనుకున్నారు



- గులాబీ బాస్‌లపై సంచలన ఆరోపణలు చేసిన కవిత
- తాను జైల్లో ఉన్నప్పుడు కొందరు నేతలు తన వద్దకు వచ్చారన్న కవిత
- బీఆర్ఎస్ ను బీజేపీలో విలీనం చేయాలనే ప్రతిపాదనతో వచ్చారని వెల్లడి
- ఆ ప్రతిపాదనను తాను తీవ్రంగా వ్యతిరేకించానన్న కవిత
- పార్టీ కోసం ప్రాణాలు త్యాగం చేయడానికి కూడా సిద్ధపడ్డానని వెల్లడి

తెలంగాణ రాజకీయాల్లో మరోసారి ప్రకంపనలు మొదలయ్యాయి. ఇటీవల బీఆర్ఎస్ తో- మిగతా 2 లో

మనం TELUGU DAILY RNI/APTEL/26/A3829 Gmail: prabhamanam@gmail.com
శుక్రవారం 19-06-2026

# విజయవాడ కస్టడీ డెత్: సీబీఐ విచారణ జరిపించాలి: వై.ఎస్. జగన్

మొదటిపేజీ తరువాయి – విచారణ జరిపించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం సాయికృష్ణ కుటుంబ సభ్యులను పరామర్శించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఈ ఘటనను కప్పిపుచ్చేందుకు విజయవాడ పోలీస్ కమిషనర్, డీజీపీ స్థాయి అధికారులు ప్రయత్నిస్తున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు. గతంలో నేరచరిత్ర ఉన్న సాయికృష్ణను మే 9వ తేదీన మార్కాపురంలో కృష్ణలంక పోలీసులు అదుపులోకి తీసుకున్నారని, అప్పటి నుంచి అతని ఆచూకీ తెలియలేదని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. తన కుమారుడిని పోలీసులు అక్రమంగా నిర్బంధించి చిత్రహింసలకు గురిచేశారని అతని తల్లి విజయలక్ష్మి హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. అయితే, తాము సాయికృష్ణను అదుపులోకి తీసుకోలేదని, అతని కోసం గాలిస్తున్నామని పోలీసులు కోర్టుకు విన్నవించారు. ఈ కేసుపై విచారణ చేపట్టిన ఆంధ్రప్రదేశ్ హైకోర్టు, పోలీసుల వాదనలపై సందేహాలు వ్యక్తం చేసింది. జూన్ 29లోగా సాయికృష్ణను కోర్టు ముందు హాజరుపరచాలని, లేనిపక్షంలో సంబంధిత అధికారులపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఆదేశించింది. ఈ పరిణామాల నేపథ్యంలో, ప్రభుత్వం కృష్ణలంక సీఐ నాగరాజును సస్పెండ్ చేసి, ఒక సీనియర్ ఐపీఎస్ అధికారితో ఉన్నతస్థాయి విచారణకు ఆదేశించింది. ఈ ఘటనకు బాధ్యులైన వారిపై తక్షణమే హత్య కేసు నమోదు చేయాలని జగన్ డిమాండ్ చేశారు. టీడీపీ ప్రభుత్వం ఈ విషయాన్ని తీవ్రంగా నిర్లక్ష్యం చేస్తోందని ఆయన విమర్శించారు.

# కోల్‌కతా వెళ్లిన నారా లోకేశ్







మొదటిపేజీ తరువాయి – జరిగింది. ఏపీ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, కోల్‌కతాలో పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారితో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయనను మంగళగిరి చేనేత శాలువాతో సత్కరించారు. ఈ సమావేశంలో మంత్రి లోకేశ్.. ఆంధ్రప్రదేశ్‌లో అమలవుతున్న పాలనా విధానాలను సువేందు అధికారికి వివరించారు. టెక్నాలజీని ఉపయోగించి అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందిస్తున్న తీరును, 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానం ద్వారా పెట్టుబడులను ఆకర్షిస్తున్న వైనాన్ని తెలియజేశారు. డిజిటల్ గవర్నెన్స్, రియల్ టైమ్ మానిటరింగ్ ద్వారా మెరుగైన ఫలితాలు సాధిస్తున్నట్లు పేర్కొన్నారు. అదే సమయంలో, పశ్చిమ బెంగాల్‌లో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆలయ నిర్మాణానికి అనువైన స్థలాన్ని కేటాయించాలని లోకేశ్ విజ్ఞప్తి చేశారు. తిరుమలలో 'పశ్చిమ బెంగాల్ భవన్' నిర్మాణానికి ఏపీ ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని హామీ ఇచ్చారు. మత్స్య సంపద పెంపు, ఎగుమతుల విషయంలో రెండు రాష్ట్రాలు పరస్పరం సహకరించుకుంటే మరింత అభివృద్ధి సాధించవచ్చని అభిప్రాయపడ్డారు. మంత్రి లోకేశ్ చేసిన ప్రతిపాదనలపై సీఎం సువేందు అధికారి సానుకూలంగా స్పందించారు.

# నేను జైల్లో ఉన్నప్పుడు బీఆర్ఎస్ ను బీజేపీలో విలీనం చేయాలనుకున్నారు

మొదటిపేజీ తరువాయి – తెగదెంపులు చేసుకుని, సొంతంగా తెలంగాణ రక్షణ సేన పేరుతో పార్టీని ఏర్పాటు చేసిన కల్వకుంట్ల కవిత.. గులాబీ బాస్‌లపై సంచలన ఆరోపణలు చేశారు. ఒక ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుతం బీఆర్ఎస్ అనే పార్టీ మనుగడలో ఉందంటే దానికి కారణం తానేనని స్పష్టం చేశారు. తాను ఢిల్లీ లిక్కర్ కేసులో జైల్లో ఉన్న సమయంలో.. బీఆర్ఎస్ పార్టీని తీసుకెళ్లి బీజేపీలో విలీనం చేయాలనే ప్రతిపాదనతో కొంతమంది నేతలు తన వద్దకు వచ్చారని కవిత వెల్లడించారు. ఆ ప్రతిపాదన వినగానే తాను తీవ్రంగా వ్యతిరేకించానని, విలీనానికి అస్సలు ఒప్పుకోకుండా స్ట్రాంగ్‌గా నిలబడ్డానని కవిత చెప్పారు. "నేనేం తప్పు చేయలేదు.. ఏదో ఒకరోజు బెయిల్‌పై కచ్చితంగా బయటకు వస్తాను, అంతవరకు పార్టీని వేరే పార్టీకి త్యాగం చేయవద్దని వారితో చెప్పాను. పార్టీ మనుగడ కోసం జైల్లో నా ప్రాణాలను సైతం త్యాగం చేయడానికి సిద్ధపడ్డాను" అని కవిత వివరించారు. ఇవాళ జైలు నుంచి బయటకు వచ్చాక కొందరు బీఆర్ఎస్ నేతలు టీవీల్లో కూర్చుని ఏది పడితే అది మాట్లాడుతున్నారని కవిత మండిపడ్డారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఓటమికి తానే కారణమంటూ వస్తున్న ఆరోపణలను ఆమె పూర్తిగా ఖండించారు. ఎన్నికల సమయంలో చర్చ అంతా కేవలం ప్రభుత్వ వైఫల్యాల గురించే జరిగిందని, కానీ ఆ చేదు నిజాన్ని అంగీకరించడానికి బీఆర్ఎస్ నాయకత్వం ఇప్పటికీ సిద్ధంగా లేదని ఎద్దేవా చేశారు. పార్టీలో తాను తీవ్రమైన పక్షపాతాన్ని, అవమానాన్ని చవిచూశానని కవిత ఆవేదన వ్యక్తం చేశారు.

# పవన్ కల్యాణ్‌కు బెంగళూరు కోర్టులో భారీ ఊరట

మొదటిపేజీ తరువాయి – ప్రసారమైన కథనాలు, వీడియోలు మరియు పోస్టులను తక్షణమే తొలగించాలని లేదా నిలిపివేయాలని ఎక్స్, గూగుల్, మెటా వంటి సామాజిక మాధ్యమ వేదికలను బెంగళూరు న్యాయస్థానం ఆదేశించింది. తెలంగాణలోని కోడి చెరువు భూ వివాదానికి సంబంధించి తనపై వస్తున్న అసత్య ఆరోపణలపై పవన్ కల్యాణ్ దాఖలు చేసిన పరువు నష్టం దావాను విచారించిన కోర్టు ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. పిటిషన్‌లో పేర్కొన్న నిర్దిష్ట యూఆర్ఎల్‌లతో పాటు, అజ్ఞాత ఖాతాల నుంచి వచ్చే ఇటువంటి పోస్టులకు కూడా ఈ ఆదేశాలు వర్తిస్తాయని స్పష్టం చేస్తూ కోర్టు "జాన్ డో" (జీశీష్ట్రఅ ణశీవ) ఉత్తర్వులు ఇచ్చింది. తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లాలోని కోడి చెరువు భూములను పవన్ కల్యాణ్ కబ్జా చేశారని, భూ రికార్డులను తారుమారు చేశారని ఆరోపిస్తూ మే నెలాఖరు నుంచి జూన్ మొదటి వారం మధ్య సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున పోస్టులు వైరల్ అయ్యాయి. ఈ దుష్ప్రచారంపై పవన్ కల్యాణ్ న్యాయపోరాటం ప్రారంభించారు. బుధవారం ఈ కేసును విచారించిన న్యాయస్థానం, తదుపరి విచారణను జులై 24వ తేదీకి వాయిదా వేసింది.




### స్వతంత్ర విదేశాంగ విధానం

రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, పశ్చిమాసియా ఉద్రిక్తతల వంటి అంశాల్లో భారత్ తన స్వతంత్ర వైఖరిని కొనసాగిస్తోంది. ఏ ఒక్క కూటమికీ పూర్తిగా అనుకూలంగా కాకుండా, చర్చలు, దౌత్య పరిష్కారాలకు ప్రాధాన్యం ఇస్తోంది. ఈ విధానం వల్లే వివిధ దేశాలతో సమాన సంబంధాలు కొనసాగించగలుగుతోంది.

### నామమాత్రం కాదు

జీ7 సమావేశాల్లో భారత్ పాల్గొనడం ఇప్పుడు కేవలం ఆహ్వానిత దేశం హోదాకు మాత్రమే పరిమితం కావడం లేదు. డిజిటల్ మౌలిక సదుపాయాలు, ఆహార భద్రత, సాంకేతికత, అభివృద్ధి వంటి అంశాలపై తన ఆలోచనలు, పరిష్కారాలను ప్రపంచానికి సూచిస్తోంది.

# 'నాన్-సీరియస్ ప్లేయర్స్'కు ఏపీలో చోటులేదు

మొదటిపేజీ తరువాయి – రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ) సమావేశంలో రూ. 30,515 కోట్ల విలువైన 50 ప్రాజెక్టులకు ఆమోదం తెలిపారు. ఈ కంపెనీల ఏర్పాటు ద్వారా రాష్ట్రంలో 29,677 ఉద్యోగాలు రానున్నాయని అంచనా వేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, పరిశ్రమల స్థాపన కేవలం ధనికులకే సాధ్యమనే భావనను తొలగించి, సామాన్యులు కూడా పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు అనువైన వాతావరణం సృష్టించాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో చంద్రబాబు మాట్లాడుతూ, "రాష్ట్రంలో పెద్ద ఎత్తున పారిశ్రామికాభివృద్ధి జరుగుతోంది. ఈ ఫలాలు పేద, మధ్య తరగతికి ఉద్యోగాల రూపంలోనే కాకుండా, వారు కూడా కంపెనీలు స్థాపించేలా ప్రోత్సహించాలి. స్టార్టప్‌లకు పెద్దపీట వేయాలి. దీనికోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆర్టీఐహెచ్ (ఆర్టీఐహెచ్) సేవలను పూర్తిస్థాయిలో వినియోగించుకుని, వెంచర్ క్యాపిటలిస్టుల నుంచి పెట్టుబడులు ఆకర్షించాలి" అని దిశానిర్దేశం చేశారు. ప్రాజెక్టులకు అనుమతులు పొందాక వెంటనే పనులు ప్రారంభించని సంస్థల విషయంలో కఠినంగా వ్యవహరించాలని, 'నాన్-సీరియస్ ప్లేయర్స్'కు ఏపీలో చోటులేదని హెచ్చరించారు.

### ఇథనాల్, సెమీ కండక్టర్లకు పెద్దపీట

ఇథనాల్ ఆధారిత ఇంధన వినియోగాన్ని ప్రోత్సహించాలని, దీనివల్ల రైతులకు ప్రయోజనం చేకూరడంతో పాటు ఇంధన దిగుమతుల భారం తగ్గుతుందని సీఎం అన్నారు. 40 శాతం ఇథనాల్ బ్లెండింగ్‌కు కేంద్రం అంగీకరించిన నేపథ్యంలో ఇథనాల్ తయారీ పరిశ్రమలను ప్రోత్సహించాలని సూచించారు. అదేవిధంగా, సెమీ కండక్టర్ల తయారీకి అవసరమైన ఎకోసిస్టమ్‌పై ప్రత్యేకంగా దృష్టి సారించాలని, లీథియం అయాన్, ఫాస్ట్ ఛార్జింగ్ బ్యాటరీల ఉత్పత్తిని ప్రోత్సహించాలని ఆదేశించారు. రైతుల కోసం ప్రత్యేకంగా మైక్రో ఇరిగేషన్ ఎక్విప్‌మెంట్ పార్క్ ఏర్పాటు చేయాలని, దీనివల్ల రైతులకు తక్కువ ధరకే పరికరాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు.

### పర్యాటకం, మౌలిక వసతులపై దృష్టి

రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని బలోపేతం చేసేందుకు టెంపుల్ టూరిజం, బీచ్ టూరిజం అభివృద్ధి చేయాలన్నారు. సూర్యలంక బీచ్‌కు మాస్టర్ ప్లాన్ తయారు చేయాలని, హార్సిలీ హిల్స్‌లో మంచి రిసార్టులు ఏర్పాటు చేయాలని సూచించారు. పురాతన స్వర్ణగిరిగా పేరున్న జొన్నగిరి గోల్డ్ మైన్ ఉత్పత్తిని వేగవంతం చేయాలన్నారు. పారిశ్రామిక ప్రాంతాల వద్ద కార్మికులకు అందుబాటు ధరల్లో గృహ నిర్మాణాలు చేపట్టాలని, ప్రాజెక్టుల అనుమతుల ప్రక్రియను ఆటోమేషన్ చేసి రాజకీయ జోక్యాన్ని తగ్గించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. పుట్టపర్తిలో 5వ తరం ఫైటర్ జెట్ తయారీ కేంద్రాన్ని వేగంగా పూర్తి చేయాలని, బెంగళూరు-పుట్టపర్తిని ఏరోస్పేస్, డిఫెన్స్ కారిడార్‌గా మార్చాలని ఆదేశించారు.

### ప్రాజెక్టులు ప్రారంభించాకే ప్రోత్సాహకాలు: మంత్రి లోకేశ్

ఈ సమావేశంలో పాల్గొన్న ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి నారా లోకేశ్ కీలక సూచనలు చేశారు. భూ కేటాయింపులు పొందిన కంపెనీలు ప్రాజెక్టులను ప్రారంభించిన తర్వాతే ప్రోత్సాహకాలు, రాయితీలు అమలు చేయాలని స్పష్టం చేశారు. "ప్రాజెక్టులు వేగంగా ప్రారంభమైతేనే జీఎస్టీ రూపంలో రాష్ట్రానికి ఆదాయం వస్తుంది. అప్పుడు ప్రోత్సాహకాలు ఇవ్వడం సమంజసంగా ఉంటుంది" అని అభిప్రాయపడ్డారు. స్థానిక పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ఐటీఐ, పాలిటెక్నిక్ విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇస్తున్నామని, ఆంధ్రా యూనివర్సిటీలో రేర్ ఎర్త్ మినరల్స్‌పై సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. ఈ సమావేశంలో మంత్రులు అచ్చెన్నాయుడు, పయ్యావుల కేశవ్, టీజీ భరత్, బీసీ జనార్దన్ రెడ్డి, కందుల దుర్గేష్, అనగాని సత్యప్రసాద్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పాకిస్థాన్‌లో అంతా ఐఎస్ఐ పెత్తనమే



మొదటిపేజీ తరువాయి – నిఘా సంస్థల మాటే నడుస్తుందని అంతర్జాతీయ సమాజం ఎప్పటి నుంచో చెబుతున్న పచ్చి నిజం. ఇప్పుడు అదే నిజాన్ని స్వయంగా ఆ దేశ రక్షణ మంత్రే పార్లమెంట్ వేదికగా అంగీకరించడం ప్రపంచవ్యాప్తంగా సంచలనం రేపుతోంది. పాక్ నిఘా సంస్థ 'ఐఎస్ఐ' గుప్పిట్లోనే ఆ దేశ చట్ట సభలు నడిచాయంటూ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ నేరుగా జాతీయ అసెంబ్లీలోనే బాంబు పేల్చారు. పాక్ జాతీయ అసెంబ్లీ సమావేశాల్లో రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ మాట్లాడుతూ... మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ పాలనలోనే ఈ పరిస్థితి తలెత్తిందని ఆరోపించారు. నాడు ఐఎస్ఐ చీఫ్‌గా ఉన్న జనరల్ ఫైజ్ హమీద్‌కు ఇమ్రాన్ ప్రభుత్వం పూర్తి స్వేచ్ఛనిచ్చిందని... ఆయన ఏకంగా నాటి స్పీకర్ నివాసంలో జరిగిన అధికారిక సమావేశాల్లో పాల్గొని చట్టసభ కార్యకలాపాలను, కీలక నిర్ణయాలను శాసించారని వెల్లడించారు. ఐఎస్ఐ ఒత్తిళ్ల కారణంగానే చట్టసభలో కొన్ని కీలక మార్పులు చేయాల్సి వచ్చిందన్నారు. ముఖ్యంగా యాంటీ మనీలాండరింగ్ చట్ట సవరణ పూర్తిగా నిఘా సంస్థకు అనుకూలంగా, వారి ఆదేశాల మేరకే అమల్లోకి తెచ్చారని సంచలన నిజాలు బయటపెట్టారు. అయితే ఇమ్రాన్ ఖాన్ కాలంలో ఐఎస్ఐ పెత్తనాన్ని తప్పుబట్టిన ఖవాజా ఆసిఫ్... తమ ప్రస్తుత ప్రభుత్వం మాత్రం సైన్యంతో కలిసి 'హైబ్రిడ్' విధానంలో నడుస్తోందని సమర్థించుకున్నారు. ప్రస్తుతం తమ దేశంలో పౌర-సైనిక హైబ్రిడ్ పాలనా విధానం అమలవుతోందని, దీనివల్ల మంచి ఫలితాలు వస్తున్నాయని పేర్కొనడం గమనార్హం. అంటే.. పేరుకు ప్రజా ప్రభుత్వం ఉన్నా, ఆర్మీ సపోర్ట్ లేనిదే తాము కూడా ఏమీ చేయలేమని ఆయన పరోక్షంగా ఒప్పుకున్నట్టయింది.

# డిజిటల్ బాటలో తెలంగాణ కేబినెట్ ఇకపై సమావేశాలు పూర్తిగా పేపర్‌లెస్

మొదటిపేజీ తరువాయి – భాగంగా 'తెలంగాణ డిజిటల్ కేబినెట్' విధానాన్ని లాంఛనంగా ప్రారంభించింది. గురువారం ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ నూతన విధానానికి ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో పాటు ఇతర మంత్రులకు ప్రత్యేక ట్యాబ్‌లను అందజేశారు. ఈ కొత్త విధానంలో భాగంగా, కేబినెట్ సమావేశాలకు సంబంధించిన అజెండా, నోట్స్ మరియు ఇతర అధికారిక పత్రాలను ముద్రించిన ఫైళ్ల రూపంలో కాకుండా డిజిటల్‌గా ట్యాబ్‌ల ద్వారానే అందుబాటులో ఉంచుతారు. ఈ వ్యవస్థ పనితీరును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా పరిశీలించారు. పరిపాలనలో సామర్థ్యం, పారదర్శకత, సుస్థిరతను పెంపొందించడంతో పాటు కాగితం వాడకాన్ని తగ్గించడమే ఈ విధానం యొక్క ప్రధాన ఉద్దేశం. కాగా, ఈ సమావేశంలో కార్యదర్శులు లేదా ఇతర అధికారులు పాల్గొనలేదు. పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ ఆగస్టు 2024లో ఈ-కేబినెట్ విధానాన్ని అమలు చేసిన దాదాపు రెండేళ్ల తర్వాత తెలంగాణ ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. గతంలో 2014-19 మధ్య కాలంలో చంద్రబాబు నాయుడు హయాంలో ఆంధ్రప్రదేశ్‌లో పేపర్‌లెస్ సమావేశాలు నిర్వహించగా, ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం దానిని నిలిపివేసింది. అనంతరం మరింత ఆధునిక వెర్షన్‌తో ఆ విధానాన్ని అక్కడ పునఃప్రారంభించారు. జాతీయ సమాచార కేంద్రం (చీ×జ) సహకారంతో ఈ-గవర్నెన్స్‌ను బలోపేతం చేయడంలో భాగంగా ఈ డిజిటల్ కేబినెట్‌ను ఏర్పాటు చేశారు. ఈ వ్యవస్థ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాధికార ప్రక్రియ మరింత వేగవంతం మరియు సులభతరం అవుతుందని అధికారులు భావిస్తున్నారు.

# భారత్-ఫ్రాన్స్ ఫుట్ బాల్ కనెక్షన్... ప్రధాని మోదీ ఆసక్తికర వ్యాఖ్యలు



మొదటిపేజీ తరువాయి – భాగంగా ప్రవాస భారతీయులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. ఇరు దేశాల ప్రజలను ఈ క్రీడ ఎంతగానో అనుసంధానిస్తోందని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. "భారత్, ఫ్రాన్స్‌లను కలిపే మరో ప్రధానాంశం ఫుట్‌బాల్. ప్రస్తుతం ఫుట్‌బాల్ ఫీవర్ తారాస్థాయికి చేరింది" అని మోదీ వ్యాఖ్యానించారు. ప్రస్తుతం జరుగుతున్న 2026 ఫిఫా ప్రపంచకప్‌లో అద్భుత ప్రదర్శన కనబరుస్తున్న ఫ్రాన్స్ జాతీయ జట్టుకు ఆయన ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు. జీ7 సదస్సులో పాల్గొనడంతో పాటు ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసుకునే లక్ష్యంతో మోదీ ఫ్రాన్స్‌లో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో సాంకేతికత, నూతన ఆవిష్కరణలపై ఆయన ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్‌తో సమావేశమైన ప్రధాని, పలు కీలక అంశాలపై చర్చలు జరిపారు. అలాగే, 'వివాటెక్ 2026' వంటి ప్రతిష్టాత్మక సాంకేతిక సదస్సులోనూ ఆయన పాల్గొన్నారు. రక్షణ, సాంకేతికత, సంస్కృతి వంటి కీలక రంగాల్లో భారత్, ఫ్రాన్స్ దేశాల మధ్య ఇప్పటికే బలమైన వ్యూహాత్మక భాగస్వామ్యం ఉంది. ఈ నేపథ్యంలో, క్రీడల ద్వారా కూడా ఇరు దేశాల ప్రజల మధ్య సంబంధాలను మరింత సుదృఢం చేయాలనే ఉద్దేశంతో ప్రధాని మోదీ ఈ వ్యాఖ్యలు చేసినట్లు తెలుస్తోంది.

# పెట్రో ధరల తగ్గింపుపై ఆశలు

మొదటిపేజీ తరువాయి – సహజవాయు శాఖ సహాయ మంత్రి సురేశ్ గోపీ స్పష్టం చేశారు. ఇంధన ధరల నిర్ణయంలో ముడిచమురు ధరలతో పాటు రవాణా, సరఫరా, మార్కెట్ పరిస్థితుల వంటి అంశాలు ప్రభావం చూపుతాయని తెలిపారు. తక్కువ ధరకు కొనుగోలు చేసిన ముడిచమురు భారత్‌కు చేరేందుకు సమయం పడుతుందని సురేశ్ గోపీ చెప్పారు. ముఖ్యంగా హర్మూజ్ జలసంధి మార్గంలో నౌకల రద్దీ ఎక్కువగా ఉండటంతో సరఫరా ప్రక్రియ సాధారణ స్థితికి రావాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అందువల్ల అంతర్జాతీయ ధరలు తగ్గిన వెంటనే దేశీయ ఇంధన ధరలను తగ్గించడం సాధ్యం కాదన్నారు. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా ఇటీవల గ్లోబల్ ఇంధన మార్కెట్లలో తీవ్ర ఒడుదొడుకులు చోటుచేసుకున్నాయని మంత్రి తెలిపారు. ముడిచమురు ధరల పెరుగుదల ప్రభావం పూర్తిగా వినియోగదారులపై పడకుండా కేంద్ర ప్రభుత్వం గణనీయమైన భారం భరించిందన్నారు. ఈ ప్రక్రియలో ప్రభుత్వానికి రూ.12 వేల కోట్ల మేర నష్టం వాటిల్లిందని చెప్పారు. ఇంధన ధరలు పెరిగిన సమయంలో రాష్ట్ర ప్రభుత్వాలు తమ పన్నులను తగ్గించి ఆదాయాన్ని వదులుకోలేదని మంత్రి వ్యాఖ్యానించారు. కేంద్ర ప్రభుత్వం, చమురు మార్కెటింగ్ సంస్థలు కూడా ఆర్థికంగా నిలదొక్కుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గే దిశగా దౌత్యపరమైన ప్రయత్నాలు ముందుకు సాగడంతో అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు తగ్గుముఖం పట్టాయి. బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 78 డాలర్లకు చేరగా డబ్ల్యూటీఐ క్రూడ్ ధర 75 డాలర్ల స్థాయికి దిగివచ్చింది. అయితే ఈ తగ్గుదల ప్రభావం దేశీయ ఇంధన ధరలపై కనిపించాలంటే మరికొంత సమయం పట్టే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.

# జీ7లో సభ్యత్వం లేదు.. అయినా భారత్‌కు రెడ్ కార్పెట్ ఎందుకు?

మొదటిపేజీ తరువాయి – చెబుతున్నారు. ప్రపంచ వేదికపై భారత్ ప్రభావం పెరగడంతో జీ7 దేశాలు కూడా మనదేశ అభిప్రాయాన్ని విస్మరించలేని పరిస్థితి ఏర్పడింది. అమెరికా, బ్రిటన్, కెనడా, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, జపాన్ కలిసి జీ7 కూటమిగా ఉన్నాయి. ఈ దేశాలే ప్రపంచంలోని సంపన్న ఆర్థిక వ్యవస్థలుగా గుర్తింపు పొందాయి. అయితే వాతావరణ మార్పులు, ఆర్థిక సంక్షోభాలు, భద్రతా సవాళ్లు, సరఫరా వ్యవస్థల వంటి అంశాలపై నిర్ణయాలు తీసుకునే సమయంలో భారత్‌ను కూడా చర్చల్లో భాగస్వామి చేస్తున్నాయి.

### గ్లోబల్ సౌత్‌కు భారత్ గొంతుక

ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికాలోని అభివృద్ధి చెందుతున్న దేశాల సమస్యలు అంతర్జాతీయ వేదికలపై తగిన స్థాయిలో ప్రతిబింబించడం లేదనే భావన చాలాకాలంగా ఉంది. ఈ దేశాల తరఫున బలంగా మాట్లాడుతున్న దేశంగా భారత్ ఎదిగింది. అభివృద్ధి చెందిన దేశాలు, అభివృద్ధి చెందుతున్న దేశాల మధ్య వారధిగా వ్యవహరిస్తోంది. అందుకే ప్రపంచ స్థాయి విధానాలు విజయవంతం కావాలంటే భారత్ వంటి దేశాల సహకారం అవసరమని జీ7 దేశాలు భావిస్తున్నాయి.

### భారీ మార్కెట్‌గా భారత్

140 కోట్లకు పైగా జనాభాతో భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద వినియోగదారుల మార్కెట్లలో ఒకటి. డిజిటల్ ఆర్థిక వ్యవస్థ, తయారీ రంగం, సాంకేతిక రంగాల్లో వేగంగా ఎదుగుతోంది. సరఫరా వ్యవస్థలను విస్తరించాలనుకుంటున్న పలు దేశాలకు భారత్ కీలక భాగస్వామిగా మారింది. ప్రపంచ ఆర్థిక స్థిరత్వంలోనూ భారత్ పాత్ర రోజురోజుకూ పెరుగుతోంది. అందుకే జీ7 దేశాలు భారత్‌తో ఆర్థిక సహకారానికి ప్రాధాన్యం ఇస్తున్నాయి.

### చైనా ప్రభావానికి చెక్

ఇండో-పసిఫిక్ ప్రాంతంలో చైనా ప్రభావం పెరుగుతుండటం పలు దేశాలకు ఆందోళన కలిగిస్తోంది. ఈ నేపథ్యంలో భారత్‌ను వ్యూహాత్మక భాగస్వామిగా పరిగణిస్తున్నారు. భౌగోళిక స్థానం, సైనిక సామర్థ్యం, ఆర్థిక బలం కారణంగా ఆసియాలో 'పవర్ బ్యాలెన్స్'ను కాపాడగల దేశంగా భారత్‌ను చూస్తున్నారు.

### వాతావరణ లక్ష్యాల్లో కీలక పాత్ర

ప్రపంచ వాతావరణ లక్ష్యాలు సాధించాలంటే 140 కోట్ల జనాభా ఉన్న భారత భాగస్వామ్యం తప్పనిసరి. పునరుత్పాదక ఇంధన రంగంలో భారత్ భారీ పెట్టుబడులు పెడుతోంది. అంతర్జాతీయ సౌర కూటమి వంటి కార్యక్రమాలకు నాయకత్వం వహిస్తోంది. అందుకే వాతావరణ మార్పులపై జరిగే ప్రతి కీలక చర్చలో భారత్‌కు ప్రత్యేక స్థానం లభిస్తోంది.

# తమిళ రాజకీయాల్లో కీలక మలుపు

మొదటిపేజీ తరువాయి – (ఢ్రూూ) నుంచి వైదొలగాలని దాదాపుగా నిర్ణయించుకుంది. ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ సారథ్యంలోని తమిళగ వెట్రి కజగం (టీవీకే) ప్రభుత్వానికి దగ్గరయ్యేందుకు రంగం సిద్ధమవుతోంది. ఈ నెల 27న జరగనున్న పార్టీ జనరల్ కౌన్సిల్ సమావేశంలో డీఎంకే కూటమి నుంచి బయటకు వస్తున్నట్లు ఎండీఎంకే అధికారికంగా ప్రకటించే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అయితే, ఈ మార్పు అంత సులువు కాదు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఎండీఎంకే తరఫున గెలిచిన ఇద్దరు ఎమ్మెల్యేలు, డీఎంకే 'ఉదయించే సూర్యుడు' గుర్తుపై పోటీ చేసి విజయం సాధించారు. దీంతో వారు నేరుగా విజయ్ ప్రభుత్వానికి మద్దతు ప్రకటించేందుకు సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆ ఇద్దరు ఎమ్మెల్యేలు తమ పదవులకు రాజీనామా చేసి, ఉప ఎన్నికల్లో మళ్లీ పోటీ చేసి గెలిచిన తర్వాత టీవీకే ప్రభుత్వానికి మద్దతు ఇవ్వాలనేది ఆ పార్టీ యోచనగా కనిపిస్తోంది. గత వారం రోజులుగా చోటుచేసుకుంటున్న రాజకీయ పరిణామాలు ఈ ఊహాగానాలకు మరింత బలం చేకూరుస్తున్నాయి. మంగళవారం రోజున రాష్ట్ర పబ్లిక్ వర్క్స్ మంత్రి ఆధవ్ అర్జున, వైగోతో ఆయన నివాసంలో భేటీ అయ్యారు. ఆ మరుసటి రోజే, బుధవారం, వైగో స్వయంగా సచివాలయంలో ముఖ్యమంత్రి విజయ్‌తో సమావేశమయ్యారు. సుమారు 45 నిమిషాల పాటు జరిగిన ఈ భేటీ తర్వాత, పొత్తుల మార్పుపై వస్తున్న వార్తలను వైగో కొట్టిపారేసినప్పటికీ, వీరి మధ్య ప్రధానంగా రాజకీయ అంశాలే చర్చకు వచ్చినట్లు సమాచారం. మరోవైపు, వైగో కుమారుడు, తిరుచిరాపల్లి ఎంపీ అయిన దురై వైగో, విజయ్ ప్రభుత్వానికి బహిరంగంగా మద్దతు తెలుపుతూ మాట్లాడారు. రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న నేరాలపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను ఆయన తిప్పికొట్టారు. ఇది కేవలం ప్రభుత్వంపై వ్యతిరేకత తీసుకురావడానికి ఒక 'కథనాన్ని' సృష్టించే ప్రయత్నమని అన్నారు. గత డీఎంకే ప్రభుత్వ హయాంలోనూ ఇలాంటి ఘటనలు జరిగాయని, వాటితో పోలిస్తే ఇప్పుడు నేరాలు గణనీయంగా ఏమీ పెరగలేదని వ్యాఖ్యానించారు. డీఎంకే గుర్తుపై పోటీ చేయడం అనే 'దురదృష్టం' వల్లే తాము టీవీకే ప్రభుత్వానికి మద్దతు ఇవ్వలేకపోతున్నామని దురై వైగో ఇటీవల చేసిన వ్యాఖ్యలు కూడా చర్చనీయాంశమయ్యాయి. ఇప్పటికే డీఎంకే మాజీ మిత్రపక్షాలైన వీసీకే, ఐయూఎంఎల్, సీపీఐ, సీపీఎం వంటి పార్టీలు విజయ్ ప్రభుత్వానికి మద్దతు ప్రకటించాయి. ఇప్పుడు ఎండీఎంకే కూడా అదే బాటలో పయనించనుంది. ఏప్రిల్ అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే గుర్తుపై నాలుగు స్థానాల్లో పోటీ చేసిన ఎండీఎంకే, రెండింటిలో గెలిచింది. ఒకవేళ ఈ ఇద్దరు ఎమ్మెల్యేలు రాజీనామా చేస్తే, తమిళనాడు అసెంబ్లీలో ఖాళీల సంఖ్య 8కి చేరుకుంటుంది. ఇందులో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత విజయ్ రాజీనామా చేసిన తిరుచ్చి ఈస్ట్ స్థానం కూడా ఉంది.

ప్రభ మనం TELUGU DAILY RNI/APTEL/26/A3829 Gmail: prabhamanam@gmail.com



## మిశ్రమ పంటల సాగుతో అధిక దిగుబడులు సాధించవచ్చు



**తుగ్గలి, జూన్ 18 ( మనం న్యూస్):** ఇటీవల మండలంలో కురిసిన వర్షాలతో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. రైతులు ముమ్మరంగా కంది ను విత్తుతున్నారు. రైతులు పంటల సాగులో తగిన జాగ్రత్తలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని రైతులకు వ్యవసాయ అధికారి సురేష్ బాబు సూచించారు. కంది పంటను ఒంటరిగా సాగు చేయడం కంటే సజ్జతో మిశ్రమ పంటగా సాగు చేయడం వల్ల రైతులకు ప్రయోజనం ఉంటుందని తెలిపారు. కంది--సజ్జ మిక్స్‌డ్ పంట సాగు చేయాలని రైతులను కోరారు. అలాగే వేరుశనగ సాగు చేసే రైతులు కూడా కంది పంటను అంతర పంటగా వేసుకోవాలని సూచించారు. వేరుశనగ, కంది పంటలను 6:1 నిష్పత్తిలో సాగు చేయడం ద్వారా నేల సారవంతత పెరగడంతో పాటు రైతులకు అదనపు ఆదాయం లభిస్తుందని పేర్కొన్నారు. కంది విత్తనాలు విత్తే ముందు తప్పనిసరిగా క్లోరోపైరిఫాస్‌తో విత్తన శుద్ధి చేసుకోవాలని సూచించారు. విత్తన శుద్ధి చేయడం వల్ల వేరు పురుగు ఆశించకుండా పంటను కాపాడుకోవచ్చని తెలిపారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు వ్యవసాయ శాఖ సూచనలు పాటిస్తూ శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేపట్టాలని కోరారు.

## బెల్ స్టార్ గోల్డ్ లోన్స్ బ్యాంకును సందర్శించిన ఎమ్మెల్యే కేఈ శ్యామ్ కుమార్:



**మనం న్యూస్ తుగ్గలి జూన్ 18:** మండల పరిధిలోని ఆర్.ఎస్ పెండేకల్ లో ఇటీవల ప్రారంభమైన బెల్ స్టార్ గోల్డ్ లోన్స్ బ్యాంకును గురువారం పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యామ్ కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ మసాలా శీను, టీడీపీ నాయకులు డాక్టర్ చంద్ర, చాంద్ బాషా, నాగరాజు తదితరులతో పాటు బ్యాంకు సిబ్బంది ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే కేఈ శ్యామ్ కుమార్ ను శాలువా, పూలమాలతో సత్క రించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బెల్ స్టార్ గోల్డ్ లోన్స్ బ్యాంకు సేవలు పెండేకల్ ప్రాంత ప్రజలకు,ముఖ్యంగా వ్యాపారులు,రైతులు,అవసరమైన వారికి ఉపయోగపడ తాయని తెలిపారు. ప్రజలకు మెరుగైన ఆర్థిక సేవలు అందించే విధంగా బ్యాంకు సిబ్బంది కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమం లో టీడీపీ మండల కన్వీనర్ తిరుపాల్ నాయుడు, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేడు తుగ్గలి కు జిల్లా కలెక్టర్ సిరి రాక:

- పిజిఆర్ఎస్ ద్వారా ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరణ:
- తహసిల్దార్ రవి:



**మనం న్యూస్ తుగ్గలి జూన్ 18 :** నేడు మండల కేంద్రమైన తుగ్గలి కు కర్నూలు జిల్లా కలెక్టర్ సిరి,జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ వస్తున్నట్లు తుగ్గలి తహసిల్దార్ రవి తెలియజేశారు. గురువారం ఆయన పాత్రికేయులకు తెలియచేస్తూ శుక్రవారం ఉదయం 9 గంటలకు తుగ్గలిలో ని సాధనా విద్యాని కేతన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ నందు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కర్నూలు జిల్లా కలెక్టర్ సిరి,జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్,పత్తికొండ శాసనసభ్యులు కే. ఈ శాంబాబులు హాజరై తుగ్గలి మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల ప్రజలకు సంబంధించిన ప్రజా సమస్యల దరఖాస్తులు స్వీకరిస్తారని వారు తెలియజేశారు. కావున శుక్రవారం రోజున జరిగే ప్రజా సమస్య పరిష్కార వేదిక కార్యక్రమానికి మండల పరిధిలోని గల అన్ని శాఖల అధికారులు తప్పకుండా హాజరుకావాలని ఆయన తెలియజేశారు. కావున ఈ ప్రజా సమస్యల పరిష్కార వేదికను మండల వ్యాప్తంగా గల ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని తహసిల్దార్ రవి ప్రజలకు తెలియజేశారు.

## రైతులకు సబ్సిడీపై వేరుశనగ విత్తనాల పంపిణీ



**తుగ్గలి, జూన్ 18 ( మనం న్యూస్ ):** మండల పరిధిలోని పగిడిరాయి గ్రామంలో గురువారం రైతులకు ప్రభుత్వం సరఫరా చేసిన సబ్సిడీ వేరుశనగ విత్తనాలను టీడీపీ సీనియర్ నాయకులు ఈశ్వర్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే కేఈ శ్యామ్ కుమార్ కృషితో మండలంలోని రైతులకు సకాలంలో సబ్సిడీపై వేరుశనగ విత్తనాలు, అవసరమైన మందులు అందుతున్నాయని తెలిపారు. రైతులకు ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ పథకాలను సద్వినియోగం చేసుకొని అధిక దిగుబడులు సాధించాలని ఆయన సూచించారు. రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎర్ర మీసాల సుంకయ్య, డీలర్ సుంకన్న, గువ్వల నాగార్జున, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## మండల టాపర్లుగా నిలిచిన విద్యార్థినీలకు నగదు ప్రోత్సాహంతో సన్మానం



**తుగ్గలి, జూన్ 18 ( మనం న్యూస్):** మండల పరిధిలోని రాతన గ్రామ సమీపంలోని ప్రభుత్వ బాలికల గిరిజన ఆశ్రమ పాఠశాలలో చదివిన మణికుమారి పదో తరగతిలో 564 మార్కులు, వనజ 550 మార్కులు సాధించి మండల టాపర్లుగా నిలిచారు. వారి విజయాన్ని గుర్తించిన పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రోజా రాణి, ఉపాధ్యాయులు గురువారం విద్యార్థినులను ఘనంగా సన్మానించి నగదు ప్రోత్సాహకాలను అందించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు రోజా రాణి మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి రెండుసార్లు పాఠశాలను సందర్శించి విద్యార్థులకు సూచనలు, సలహాలు అందించడంతో పాటు అవసరమైన మౌలిక వసతులు కల్పించారని తెలిపారు. ఉపాధ్యాయుల సమష్టి కృషితో ఈ ఏడాది పాఠశాల 89.47 శాతం ఉత్తీర్ణత సాధించిందన్నారు. మండల టాపర్లుగా నిలిచిన మణికుమారి, వనజ లు మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు పాఠాలు సులభంగా అర్థమయ్యేలా బోధించడంతో పాటు నిరంతరం ప్రోత్సహించారని తెలిపారు. వారి మార్గదర్శకత్వం వల్లే మంచి మార్కులు సాధించగలిగామని పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయురాలు రోజా రాణి బాధ్యతలు స్వీకరించిన తర్వాత గణనీయమైన మార్పు సాధించిందని విద్యార్థినుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. తమ పిల్లలు మండల స్థాయిలో గుర్తింపు పొందడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లోనూ సరైన మార్గదర్శకత్వం, కృషి ఉంటే గ్రామీణ, గిరిజన విద్యార్థులు ఉన్నత విజయాలు సాధించగలరనేందుకు ఈ విద్యార్థినుల విజయం నిదర్శనంగా నిలిచింది.

## పీకలబెట్ట దేవాలయాల్లో హుండీ చోరీ కలకలం

- రూ.5,800 నగదుతో పరారికి యత్నం
- ఇద్దరు మైనర్ బాలుర పట్టివేత





**పెద్దకడబూరు జూన్ 18,ప్రభ మనం:** మండల పరిధిలోని పీకలబెట్ట గ్రామంలో శివాలయం, ఆంజనేయస్వామి దేవాలయాల్లో హుండీ చోరీ ఘటన స్థానికంగా కలకలం రేపింది. గురువారం ఉదయం సుమారు 8 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు హుండీని పగులగొట్టి అందులో ఉన్న రూ.5,800 నగదును అపహరించారు. చోరీ అనంతరం నగదుతో పరారవుతున్న ఇద్దరు మైనర్ బాలురను స్థానికులు అప్రమత్తంగా పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ప్రాథమిక విచారణలో వారు పెద్దతుంబలం గ్రామానికి చెందిన వారిగా గుర్తించినట్లు ఎస్ఐ మారుతి తెలిపారు. ఈ ఘటనపై పీకలబెట్ట గ్రామానికి చెందిన బోయ నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కేసుకు సంబంధించి పూర్తి వివరాలు సేకరిస్తూ దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు. దేవాలయాల్లో వరుసగా భద్రతా లోపాలు వెలుగుచూస్తుండటంతో హుండీలు,ఆలయ ఆస్తుల రక్షణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరారు.

## గొడ్డలి పార్టీకి రాబోయే రోజుల్లో తగిన గుణపాఠం చెబుతాం

- రెండేళ్ల లో రూ 488.62 కోట్లతో అభివృద్ధి, సంక్షేమం అభివృద్ధికి దాదాపు రూ 350 కోట్లు - సంక్షేమానికి రూ 138.62 కోట్లు
- బీసీలు అంత ఐక్యమత్యంతో ఉండాలి.
- ముఖ్య అతిథిగా హాజరైన టిడిపి జిల్లా అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మ
- ప్రతి టిడిపి కార్యకర్తకు అండగా ఉంటా
- మంత్రాలయం టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ ఎన్. రాఘవేంద్ర రెడ్డి







**మంత్రాలయం , జూన్ 18,మనం న్యూస్ ;** గొడ్డలి పార్టీకి రాబోయే రోజుల్లో తగిన గుణపాఠం చెప్పడం జరుగుతుందని మంత్రాలయం టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ ఎన్ రాఘవేంద్రరెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని మాధవరం గ్రామంలోని తెదేపా కార్యాలయంలో కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో అభివృద్ధి, సంక్షేమ పథకాలపై విజయోత్సవ సభను ఏర్పాటు చేశారు. అంతకు ముందు టిడిపి పార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారక రామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ,ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ఆశీస్సులతో మంత్రాలయం నియోజకవర్గం లో రూ .కోట్ల రూపాయలు నిధులు తెచ్చి ఎన్నో అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు గ్రామాలలో సిసి రోడ్లు తాగునీటి వంటి పథకాలు తీసుకురావడం జరిగిందన్నారు. అభివృద్ధి అభివృద్ధికి మారుపేరు తెలుగుదేశం పార్టీ అన్నారు. నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి ఒక్క సీసీ రోడ్డు అయినా వేశావని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి పై ధ్వజమెత్తారు. బీసీల మధ్య ,ఎస్సీల మధ్య గొడవలు సృష్టించి దాడులకు పాల్పడ్డారని దుయ్యబడ్డారు. రాంపురంకు దగ్గరలో ఉన్న ఎనిమిది గ్రామాలలో ప్రజాస్వామ్యం లేకుండా వాళ్లను పీడించి నియంత్రణ పాలన చేస్తూ వారిని నిత్యం వేధిస్తూ భయభ్రాంతులకు గురి చేస్తూ పబ్బం గడుపుకుంటున్నావు నీవు కాదా అని విమర్శించారు. బీసీలంత ఐక్యమత్యంతో ఉండే రాబోయే స్థానిక సంస్థ ఎన్నికల్లో తెదేపా పార్టీ అభ్యర్థులను గెలిపించుకొనందుకు ప్రతి కార్యకర్త కష్టపడి పని చేయాలన్నారు.

**టిడిపి జిల్లా అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మ మాట్లాడుతూ ;**

రెండేళ్ల కూటమి పాలనలో రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమం వైపు పరుగులు తీస్తోంది. గత వైసీపీ పాలనలో ప్రజలను ఇబ్బందులకు గురి చేసిన పరిస్థితులకు ముగింపు పలికి, కూటమి ప్రభుత్వం ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుందని తెలిపారు.

**మంత్రాలయం సొసైటీ చైర్మన్ ఎన్.రామకృష్ణ రెడ్డి మాట్లాడుతూ:**

మంత్రాలయం నియోజకవర్గ అభివృద్ధికి ఎన్. రాఘవేంద్ర రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ప్రతి గ్రామంలో అభివృద్ధి ఫలాలు అందిస్తోంది. ఇది ఓర్చుకోలేక వైసీపీ వాళ్ళు విషయా ప్రచారం మానుకోవాలి. మా ఇంచార్జి సత్త ఎంటో రాబోయే స్థానిక సంస్థ ఎన్నికల్లో చూపిస్తాం అన్నారు. భారిగా పోలీసు బందోబస్తు:- ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఏఎస్పి హుశేన్ పీర, డిఎస్పీ ఉపేంద్ర బాబు, 13 మంది సిఐ లు, 11 మంది ఎస్సై లు, 11 ఏఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్, 40 మంది హోంగార్డులు, 18 మంది ఏఆర్ కానిస్టేబుల్, 36 మంది కానిస్టేబుల్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు మాధవరం ఎస్సై విజయ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నరవ రమాకాంత్ రెడ్డి,నరవ శశి రేఖ,ముత్తురెడ్డి,బసలదొడ్డి ఈరన్న, చైర్మన్ టిప్పుసుల్తాన్,మార్కెట్ యార్డ్ చైర్మన్ నర్సిరెడ్డి,నాలుగు మండలాల అధ్యక్షులు గోపాల్ రెడ్డి, పల్లెపాడు రామిరెడ్డి, సురేష్ నాయుడు,బసలదొడ్డి మల్లికార్జున,సొసైటీ చైర్మన్లు నాడిగినేని అయ్యన్న,రాఘమ్మా,వెంకటపతి రాజు,మారెప్ప,నర్సప్ప,మీసేవ ఆంజనేయ్య,మరియు అశోక్ రెడ్డి,మాధవరం శ్రీనివాసులు,అడివప్ప గౌడ్,తోవి రామకృష్ణ,కురువ వీరేష్,కుంబులూరు చిన్న, లక్ష్మయ్య, చావిడి వెంకటేష్, జ్ఞానేష్,హొళగుండా కోసిగియ్య, సాతనూరు కోసిగియ్య, సంజీవిగేని ఈరన్న,వీరేష్,వరదరాజు, పవన్,మల్లి,అధిక సంఖ్యలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయోత్సవ సభను ఘన విజయవంతం చేశారు.

## కౌతాళం మండల కేంద్రంలో కెనరా బ్యాంకులో మద్య దళారులను తొలగించాలి

- బ్యాంకులో రైతుల అప్పులు మధ్య దళారులతో కట్టిస్తే బ్యాంకు సిబ్బందికి ,మేనేజర్ కు వాటా ఎంత ?
- రైతుల అప్పులు కట్టేటప్పుడు అసలు కాకుండా, వడ్డీ మాత్రమే కట్టించుకోవాలి....
- రైతు సంఘం డిమాండ్.!





**కౌతాళం జూన్ 18 ప్రభ మనం న్యూస్:** కౌతాళం మండల కేంద్రంలో కెనరా బ్యాంకులో రైతుల వ్యవసాయ రుణాలు రెన్యువల్ డబ్బులు చెల్లించడానికి వెళ్ళితే అక్కడ బ్యాంకులో మధ్య దళారులు వాళ్లతో( రైతు తో )కలిసి నీ అప్పు నేను కడతాను అని చెప్పి ,ఆయన అప్పు మధ్య దళారులు కట్టడం వల్ల ,వడ్డీ, మధ్యదళారుల కమిషన్, ఇతర ఖర్చులు అన్నీ కూడా రైతే భరించవలసి ఉంటుంది. కనుక బ్యాంకులో మధ్య దళారులను తొలగించాలని, బ్యాంకులోకి అనుమతించరాదని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కే మల్లయ్య మేనేజర్ గారికి మెమోరాండం ఇవ్వడం అయినది. కౌతాళం మండలంలో ఆరు బ్యాంకులు ఉన్నాయి. ఏ బ్యాంకుల్లో కూడా కెనరా బ్యాంకులో ఉన్నటువంటి మధ్య దళారుల వ్యవస్థ లేదు. రైతులే నేరుగా బ్యాంకుకు పోయి మేనేజర్ తో మాట్లాడి స్తోమత ఉన్నవాళ్లు అసలు ,వడ్డీ కలిపి కడతారు. స్తోమత లేని వాళ్ళు వడ్డీ మాత్రమే కట్టి రెన్యువల్ చేయించుకుంటారు అలాంటి పద్ధతి కెనరా బ్యాంకులో లేదు. ఇక్కడ మధ్య దళారులకు ,బ్యాంకు సిబ్బందికి ,మేనేజర్ గారికి లోపాయికారిగా ఒప్పందాలు చేసుకొని లావాదేవీలు జరుగుతున్నాయని ఆయన అన్నారు. రైతు అప్పు మధ్య దళారులు కడితే సంవత్సరానికి, సంవత్సరానికి అప్పు పెరుగుతుంది తప్ప , రైతుకు అప్పు సమస్య తీరదు అని ఆయన అన్నారు .కనుక ఇప్పటి నుంచైనా బ్యాంకు బ్యాంకు సిబ్బంది, మేనేజర్ గారు మేల్కొని బ్యాంకులో మద్దతుదారుల వ్యవస్థను రద్దు చేయాలని లేకపోతే రైతులను సమీకరించి బ్యాంకు ముందు ఆందోళన కార్యక్రమాలను చేయగలమని ఆయన హెచ్చరించినాడు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి బి ఈరన్న ,రైతు సంఘం నాయకులు సత్యప్ప ,ఈరన్న, వెంకటేష్ ,నారాయణ, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ఎన్డీఏ కూటమి ఆధ్వర్యంలో రెండు సంవత్సరాల సుపరిపాలన స్వర్ణాంధ్రప్రదేశ్ సభ విజయవంతం

**టిడిపి ఇన్చార్జ్ ఎన్ రాఘవేంద్ర రెడ్డి, జనసేన పార్టీ ఇన్చార్జి వాల్మీకి బి లక్ష్మన్న, బిజెపి ఇన్చార్జ్ ఎన్ విష్ణువర్ధన్ రెడ్డి.**







**మంత్రాలయం, జూన్,18,ప్రభ మనం:** మండల పరిధిలోని మాధవరం గ్రామంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెండేళ్ల సుపరిపాలన, స్వర్ణాంధ్రప్రదేశ్ సభ విజయవంతమైంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం రెండేళ్ల పరిపాలన పూర్తి చేసుకున్న సందర్భంగా టిడిపి ఇన్చార్జ్ ఎన్ రాఘవేంద్ర రెడ్డి, జనసేన పార్టీ ఇంచార్జ్ వాల్మీకి బి లక్ష్మన్న, బిజెపి ఇంచార్జ్ ఎన్ విష్ణువర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో సభ జరిగింది. టిడిపి జిల్లా అధ్యక్షురాలు ఆది గుడిసె కృష్ణమ్మ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సభను ఉద్దేశించి ప్రసంగించారు. సభ అధ్యక్షుడిగా అశోక్ రెడ్డి గారు ఉన్నారు. ఈ సమావేశంలో మంత్రాలయం జనసేన పార్టీ ఇన్చార్జి వాల్మీకి బి లక్ష్మన్న మాట్లాడుతూ మన దేశ ప్రధాని నరేంద్ర మోడీ గారు, మన రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు గారు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి వర్యులు శ్రీ కే పవన్ కళ్యాణ్ గారు నాయకత్వంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం రుణాంధ్రప్రదేశ్ నుంచి స్వర్ణాంధ్రప్రదేశ్ దిశగా పరుగులు పెడుతుందని అన్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు శ్రీ కే పవన్ కళ్యాణ్ గారి దగ్గర అత్యంత ముఖ్యమైన శాఖ పంచాయతీరాజ్ శాఖ ఉంది. ఈ పంచాయతీరాజ్ శాఖకు దేశంలోనే బెస్ట్ శాఖ అవార్డు వచ్చింది. రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ కె పవన్ కళ్యాణ్ గారు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ గారు ఈ ముగ్గురు రాష్ట్రం కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారని అందువల్లనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అభివృద్ధి దేశాల్లో పరుగులు పెడుతుందనిఅన్నారు. మంత్రాలయం టిడిపి ఇన్చార్జ్ ఎన్ రాఘవేంద్ర రెడ్డి గారు మాట్లాడుతూ మంత్రాలయం నియోజకవర్గంలో దాదాపు 350 కోట్ల రూపాయలు పైగా అభివృద్ధి కోసం ఖర్చు పెట్టామని నేను ఎమ్మెల్యేగా గెలవలేకపోయినా ఎక్కడ రాజీ పడకుండా మంత్రాలయం నియోజవర్గాన్ని అభివృద్ధి చేసి చూపించామనిఅన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే మంత్రాలయ నియోజకవర్గాన్ని కొంచెం కూడా అభివృద్ధి చేయలేదని రాఘవేంద్ర రెడ్డి అన్నారు. తాను చేసిన అభివృద్ధి కార్యక్రమాలు అన్నీ కూడా ఎన్ రాఘవేంద్ర రెడ్డి గారు సభకు వివరించారు. టిడిపి యువ నాయకుడు మంత్రాలయం సింగల్ విండో అధ్యక్షు డు ఎన్ రామకృష్ణారెడ్డి గారు మాట్లాడుతూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చేసిన అభివృద్ధి ఏమీ లేదని నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన బాల నాగిరెడ్డి గారు మంత్రాలయం నియోజకవర్గం ఏమీ అభివృద్ధి పరచలేదని ఆవేశంగా మాట్లాడారు. 2029 ఎన్నికల్లో టిడిపి తరపున ఎమ్మెల్యే సీటు రాఘవేంద్ర రెడ్డి గారిని గెలిపించి చూపిస్తామని అన్నారు.కోసిగి మార్కెట్ యార్డ్ చైర్మన్ నర్సిరెడ్డి గారు,ఎన్ విష్ణువర్ధన్ రెడ్డి గారు, ఎన్ రమకాంత్ రెడ్డి గారు, ఎన్ శశిరేఖ మేడంగారు, చావిడి వెంకటేష్ గారు, సురేష్ నాయుడు గారు, ఆర్ లక్ష్మయ్య గారు, వెంకటేశులు గారు, టిడిపి సీనియర్ నాయకులు బస్సుల దొడ్డి ఈరన్న, మొదలగు వక్తలు అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రసంగించారు. జనసేన పార్టీ నాయకులు రామాంజనేయులు గారు, చిన్న గారు, బజార్ అప్ప గారు ( అబ్రహం) సభను ఉద్దేశించి అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాలుగు మండలాల అధ్యక్షులు గోపాల్ రెడ్డి, మల్లికార్జున, పల్లిపాడు రామిరెడ్డి, సురేష్ నాయుడు మరియు జనసేన పార్టీ నాలుగు మండలాల అధ్యక్షులు బివి రవిచంద్ర, జి బజార్ అప్ప, వీరారెడ్డి, సుమిత్ర జనసేన పార్టీ సీనియర్ నాయకులు కౌతాళం రామాంజనేయులు, ఎస్ చిన్న, ఆలీ భాష, ఎస్ ఏ షోబు, చైర్మన్లు మారెప్ప, టిప్పు సుల్తాన్ టిడిపి నాయకులు ముత్తిరెడ్డి, అడివప్ప గౌడ్, మరియు నియోజకవర్గంలోని ముఖ్య నాయకులు కార్యకర్తలు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఎన్డీఏ కూటమి సభ సూపర్ సక్సెస్ అయిందని సభకు వచ్చిన ప్రతి ఒక్కరూ ప్రశంసించారు.

మనం
శుక్రవారం 19-06-2026

# మారెన్న భౌతికకాయాన్ని పూలమాలలు వేసి నివాళులర్పించిన వైఎస్సార్ సీపీ నేత



**మంత్రాలయం , జూన్ 18,మనం న్యూస్ ;** కౌతాళం మండల పరిధిలోని నదిచాగి గ్రామానికి చెందిన వైసిపి సీనియర్ నాయకులు పోస్ట్ మారెన్న బుధవారం గుండెపోటుతో మరణించారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ కర్నూలు జిల్లా ఉపాధ్యక్షులు వై.ప్రదీప్ రెడ్డి గురువారం గ్రామానికి చేరుకొని మారెన్న మృతదేహానికి పూలమాలవేసి నివాళు లర్పించారు.అనంతరం కుటుంబ సభ్యులకు రాంపురం రెడ్డి సోదరులు కుటుంబం ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయనతో పాటు రామన్న గౌడ్, మాజీ ఎంపీటీసీలు కే.ఈశప్ప గౌడ్ టీ.లింగన్న గౌడ్. మరియు నాయకులు కార్యకర్తలు కూడా ఉన్నారు..

# పిల్లల కోపమంతా మొండితనం కాదు

## వారిలో ఈ 6 లక్షణాలు కనిపిస్తే అస్సలు నిర్లక్ష్యం చేయకండి!



పిల్లల ప్రవర్తనలో ఆకస్మిక మార్పులు వస్తున్నాయా..

బాల్యం అనేది ఎంతో సున్నితమైన సమయం కాబట్టి పిల్లల్లో కనిపించే కోపం, చిరాకు లేదా విచారాన్ని కేవలం అల్లరి, మొండితనం అని కొట్టిపారేయకూడదని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. జాతీయ ఆరోగ్య మిషన్ (చీఎవీ) ప్రకారం, పిల్లల ప్రవర్తనలో వచ్చే ఆకస్మిక మార్పులు వారు ఎదుర్కొంటున్న మానసిక ఒత్తిడి లేదా ఆందోళనకు సంకేతాలు కావచ్చు. చిన్న చిన్న విషయాలకే కోపపడటం, నిరంతర నిరాశ, కారణం లేని తలనొప్పి, కడుపునొప్పి వంటి 6 ముఖ్యమైన లక్షణాలను సకాలంలో గుర్తించి, వారితో స్నేహపూర్వకంగా మాట్లాడటం ద్వారా భవిష్యత్తులో వచ్చే పెద్ద మానసిక సమస్యలను నివారించవచ్చు. బాల్యం అనేది ప్రతి ఒక్కరి జీవితంలోనూ అత్యంత సున్నితమైన , భావోద్వేగభరితమైన సమయం. ఈ వయస్సులో పిల్లల మనస్తత్వం చాలా మృదువుగా ఉంటుంది. అయితే చాలా మంది తల్లిదండ్రులు తమ పిల్లలు చూపించే కోపం, విపరీతమైన చిరాకు లేదా ఆకస్మిక విచారాన్ని కేవలం వారి మొండితనం లేదా అల్లరి అని భావించి తేలికగా విస్మరిస్తుంటారు. ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం ఇది చాలా పెద్ద పొరపాటు. పిల్లలు తమ మనసులోని భయాలను, ఒత్తిళ్లను లేదా బయటి వ్యక్తుల నుండి ఎదురైన చెడు అనుభవాలను మాటల రూపంలో స్పష్టంగా వ్యక్తపరచలేనప్పుడు, వాటిని శారీరక మార్పులు లేదా కోపం రూపంలో బయటపెడుతుంటారు. జాతీయ ఆరోగ్య మిషన్ (చీఎవీ) నివేదికల ప్రకారం, పిల్లలలో మానసిక ఒత్తిడి, ఆందోళన (యాంగ్జైటీ) లేదా కుంగుబాటు (డిప్రెషన్) ఉన్నప్పుడు కనిపించే 6 ప్రధాన లక్షణాల వివరాలు ఇక్కడ చూద్దాం. పిల్లలలో గమనించవలసిన ఆ 6 ముఖ్యమైన లక్షణాలు నిరంతర నిరాశ లేదా ఆసక్తి లేకపోవడం: పిల్లలు సాధారణంగా ప్రతి విషయానికి ఎంతో ఉత్సాహంగా ఉంటారు. అలా కాకుండా వారు పదేపదే తీవ్రమైన నిరాశకు గురవుతున్నా, లేదా గతంలో ఇష్టంగా చేసిన పనులపై, ఆటలపై అకస్మాత్తుగా ఆసక్తిని కోల్పోతున్నా దానిని తీవ్రంగా పరిగణించాలి. తలనొప్పి , కడుపునొప్పి ఫిర్యాదులు: ఎటువంటి స్పష్టమైన శారీరక అనారోగ్య కారణం లేకపోయినప్పటికీ, పిల్లలు తరచుగా కడుపునొప్పి లేదా తలనొప్పి వస్తోందని ఫిర్యాదు చేస్తుంటే అది మానసిక ఒత్తిడికి సంకేతం కావచ్చు. మనసులోని ఆందోళనలు పిల్లల్లో ఇలా శారీరక నొప్పుల రూపంలో వ్యక్తమవుతుంటాయి. చిరాకు విపరీతంగా పెరగడం: ప్రతి చిన్న విషయానికి విపరీతంగా చిరాకు పడటం, అకారణంగా విసుగు ప్రదర్శించడం కూడా పిల్లల అంతర్గత మానసిక అశాంతిని సూచిస్తుంది. ఆకస్మిక భావోద్వేగ మార్పులు: పిల్లల మూడ్స్ చాలా వేగంగా మారడం, అంటే ఒక నిమిషం క్రితం వరకు ఎంతో సంతోషంగా ఉన్న పిల్లలు హఠాత్తుగా తీవ్రమైన విచారంలోకి లేదా కోపంలోకి మారిపోవడం వంటి ఆకస్మిక మార్పులు వారి మనస్సు తీవ్రమైన ఒత్తిడిలో ఉందనడానికి బలమైన నిదర్శనం. ప్రతి చిన్న విషయానికి కోపం తెచ్చుకోవడం: చిన్నపాటి విషయాలకే విపరీతంగా కోపగించుకోవడం, ఇంట్లో వాళ్లతో లేదా తోటి పిల్లలతో పదేపదే గొడవ పడటం వంటి ప్రవర్తనను కేవలం మొండితనం అనుకోకూడదు. సహాయం కోసం..: కొన్నిసార్లు పిల్లల ప్రవర్తనలో వచ్చే ఆకస్మిక మార్పులు వారు లోలోపల ఎదుర్కొంటున్న ఇబ్బందుల నుండి బయటపడటానికి పెద్దల సహాయాన్ని కోరే నిశ్శబ్ద ఆర్తనాదంగా భావించాలి. తల్లిదండ్రులు తీసుకోవలసిన జాగ్రత్తలు జాతీయ ఆరోగ్య మిషన్ (చీఎవీ) తల్లిదండ్రులకు ఒక ముఖ్యమైన విజ్ఞప్తి చేస్తోంది. పిల్లలలో కనిపించే ఈ ప్రవర్తనా మార్పులు పాఠశాలలో ఉపాధ్యాయులు లేదా తోటి విద్యార్థుల నుండి ఎదురవుతున్న ఒత్తిడి, స్నేహితులతో సమస్యలు, కుటుంబంలో జరిగే కలహాలు లేదా వారిలోని ఒంటరితనానికి సంకేతంగా ఉండవచ్చు. ఎవరైనా ఏదైనా తప్పుగా చెప్పి భయపెట్టినా పిల్లలు ఇలాగే ప్రవర్తిస్తారు. అందుకే పిల్లలలో ఈ లక్షణాలు కనిపిస్తే వారిని చిన్న విషయాలకే తిట్టడం లేదా కొట్టడం వంటి పనులు అస్సలు చేయకూడదు. తల్లిదండ్రులు తమ పిల్లలకు మొదటి , ఉత్తమ స్నేహితులుగా మారాలి. ప్రతిరోజూ వారితో నిష్కపటంగా, సానుకూలంగా మాట్లాడటం అలవాటు చేసుకోవాలి. వారు చెప్పే ప్రతి మాటను మధ్యలో అడ్డుకోకుండా శ్రద్ధగా వినాలి. ఒకవేళ ఈ మార్పులు చాలా రోజుల పాటు అలాగే కొనసాగుతూ ఉంటే, ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే అనుభవజ్ఞులైన బాలల మనస్తత్వవేత్త (చైల్డ్ సైకాలజిస్ట్) లేదా కౌన్సిలర్‌ను సంప్రదించి సరైన సలహా తీసుకోవడం ద్వారా పిల్లల భవిష్యత్తును సురక్షితంగా కాపాడుకోవచ్చు.

# సమ్మర్‌లో ఈ ఫ్రూట్స్ తినకపోతే చాలా మిస్ అయినట్టే

# మ్యాంగోస్ మాత్రం కాదు

భారతదేశంలో వేసవి ఎండలు మండిపోతుంటాయి, కానీ అదే సమయంలో ప్రకృతి మనకు రుచికరమైన, పోషక విలువలున్న పండ్లను అందిస్తుంది. విదేశీ పండ్ల కంటే మన దేశీ బెర్రీలు ఆరోగ్యాన్ని ఇవ్వడమే కాకుండా, శరీరానికి చలవ చేస్తాయి. విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లతో నిండిన ఈ వేసవి పండ్ల గురించి, వాటి ప్రత్యేకతల గురించి వివరంగా తెలుసుకుందాం! వేసవి కాలం రాగానే దాహం, అలసట సహజం. ఈ సమస్యలను అధిగమించడానికి మార్కెట్లో దొరికే కృత్రిమ కూల్ డ్రింక్స్ కంటే, మన స్థానిక బెర్రీలే ఉత్తమం. మన ఆహార సంప్రదాయాల్లో భాగమైన జామూన్, ఫల్సా వంటి పండ్లు రోగనిరోధక శక్తిని పెంచి మనల్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. అద్భుతమైన రుచి, పోషకాలను అందించే ఆ దేశీ బెర్రీల గురించి తెలుసుకుందాం!

### వేసవిలో లభించే అద్భుతాలు

వేసవి ఎండల నుంచి రక్షణ పొందడానికి మరియు శరీరానికి కావాల్సిన పోషకాలను అందించడానికి మనకు దొరికే స్థానిక పండ్లు ఎంతో సహాయపడతాయి. విదేశీ బ్లూబెర్రీలు, రాస్ప్బెర్రీల కోసం వెతకాల్సిన అవసరం లేదు, మన భారతదేశంలోనే ఎంతో కాలంగా వాడుకలో ఉన్న అద్భుతమైన బెర్రీలు ఎన్నో ఉన్నాయి. జామూన్ (నేరేడు): వేసవిలో అందరూ ఎదురుచూసే పండు ఇది. దీని ముదురు ఊదా రంగు, తీపి మరియు పులుపు కలిసిన రుచి ఎంతో బాగుంటుంది. ఫల్సా: చిన్నపాటి ఊదా రంగు పండు ఇది. దీన్ని ఎక్కువగా చల్లని పానీయాలు చేయడానికి ఉపయోగిస్తారు, ఇది శరీరానికి తక్షణ ఉల్లాసాన్ని ఇస్తుంది. కరోందా: వీటిని ఎక్కువగా పచ్చళ్లు, చట్నీలు చేయడానికి ఉపయోగిస్తారు. వీటి పుల్లని రుచి వంటకాలకు ప్రత్యేకతను తెస్తుంది. మల్బరీ: దేశవ్యాప్తంగా లభించే ఈ పండ్లు చాలా రసభరితంగా, తియ్యగా ఉంటాయి. రస్‌భరీ (ఋజూవ స్రశీశీంవఎవతీతీఎ), మహువా: ఇవి కొన్ని ప్రాంతాలకే



సమ్మర్ ఈ ఫ్రూట్స్ తినకపోతే చాలా మిస్ అయినట్టే

పరిమితమైనా, స్థానికులు వీటిని ఎంతో ఇష్టంగా తింటారు. ఇవి సంప్రదాయ ఆహారంలో భాగం.

### ఆరోగ్యంపై ప్రభావం

ఈ పండ్లు కేవలం రుచికరమే కాదు, ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. వీటిలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు శరీర కణాలను దెబ్బతినకుండా కాపాడతాయి. విటమిన్-సి అధికంగా ఉండటం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. పీచు పదార్థం (ఖీఱఎవతీ) జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది మరియు వేసవిలో మనల్ని హైడ్రేటెడ్‌గా ఉంచుతుంది. సీజనల్ పండ్లను తినడం వల్ల తాజాగా పండించిన పంటను మనం ఆస్వాదించవచ్చు. ఇవి ఎక్కువ దూరం ప్రయాణించి రావు కాబట్టి, వాటి పోషకాలు అలాగే ఉంటాయి. వీటిని నేరుగా తినవచ్చు లేదా జ్యూస్‌లు, డెజర్ట్‌లలో వాడుకోవచ్చు. మీరు తదుపరిసారి మార్కెట్‌కు వెళ్ళినప్పుడు, ఈ దేశీ బెర్రీలను ఎంచుకోండి. వేసవిని సహజమైన రుచులతో, ఆరోగ్యంతో ఆస్వాదించండి. మన దేశీయ పండ్ల వైభవాన్ని గుర్తించి, వాటిని మన దైనందిన ఆహారంలో భాగంగా మార్చుకుందాం. ఇవి మనల్ని ఆరోగ్యంగా ఉంచడమే కాకుండా, మన సంప్రదాయాలను కూడా గౌరవించినట్లు అవుతుంది.

# శ్రీ మఠంలో వైకాపా సీనియర్ నేత సీతారామిరెడ్డి




**మంత్రాలయం , జూన్ 18,మనం న్యూస్:** ఆధ్యాత్మిక క్షేత్రమైన మంత్రాలయం రాఘవేంద్రస్వామి దర్శనార్థం వైఎస్సార్ సీపీ కార్యనిర్వాహక సభ్యులు పత్తికొండ అసెంబ్లీ పరిశీలకులు వై.సీతారామిరెడ్డి గురువారం వచ్చారు. వీరికి వైకాపా నాయకులు స్వాగతం పలికారు. వారు ముందుగా గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకొని పూజలు చేసి మంగళహారతి ఇచ్చారు. అనంతరం రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకున్నారు. వారికి మఠం పీఠాధిపతులు సుభుదేంద్ర తీర్థులు శేషవస్త్రం కప్పి , మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు. వారి వెంట మఠం సూపరింటెండెంట్ పురాణిక్ రాఘవేంద్ర , వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

# MRI పని అయిపోయిందా రేడియేషన్ లేకుండా శరీరం మొత్తం చెక్.. కొత్త స్కానర్ సంచలనం!




కృత్రిమ మేధ (AI) వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తున్న వేళ, ఇప్పుడు ఎంఆర్ఐ (MRI) స్కానింగ్‌కు ప్రత్యామ్నాయంగా ఓ కొత్త సాంకేతికత చర్చనీయాంశంగా మారింది. ఏఐ ఇమేజ్ జనరేషన్ మోడల్‌తో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన మిడ్‌జర్నీ సంస్థ తాజాగా "మిడ్‌జర్నీ స్కానర్" అనే వినూత్న వైద్య పరికరాన్ని పరిచయం చేసింది. ఈ పరికరం కేవలం ఒక నిమిషంలోనే పూర్తి శరీరాన్ని స్కాన్ చేసి, ఎంఆర్ఐకు సమానమైన ఫలితాలను అందించగలదని కంపెనీ చెబుతోంది. కృత్రిమ మేధ (AI) వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తున్న వేళ, ఇప్పుడు ఎంఆర్ఐ (MRI) స్కానింగ్‌కు ప్రత్యామ్నాయంగా ఓ కొత్త సాంకేతికత చర్చనీయాంశంగా మారింది. ఏఐ ఇమేజ్ జనరేషన్ మోడల్‌తో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన మిడ్‌జర్నీ సంస్థ తాజాగా "మిడ్‌జర్నీ స్కానర్" అనే వినూత్న వైద్య పరికరాన్ని పరిచయం చేసింది. ఈ పరికరం కేవలం ఒక నిమిషంలోనే పూర్తి శరీరాన్ని స్కాన్ చేసి, ఎంఆర్ఐకు సమానమైన ఫలితాలను అందించగలదని కంపెనీ చెబుతోంది. మిడ్‌జర్నీ సీఈఓ డేవిడ్ హోల్జ్ ఈ ప్రాజెక్ట్‌ను విచిత్రమైనదైనా, అత్యంత ఆశాజనకమైనదిగా అభివర్ణించారు. ఈ స్కానర్ అల్ట్రాసౌండ్ సాంకేతికత ఆధారంగా పనిచేస్తుందని తెలిపారు. స్కానింగ్ సమయంలో వ్యక్తి సుమారు ఒక నిమిషం పాటు నీటిలో నిలబడాలి. పరికరంలోని సెన్సార్లు వివిధ కోణాల నుంచి అల్ట్రాసోనిక్ తరంగాలను శరీరంలోకి పంపి, తిరిగి వచ్చే సంకేతాలను విశ్లేషిస్తాయి. అనంతరం కండరాలు, కొవ్వు, ఎముకలు, అంతర్గత అవయవాల వివరాలతో కూడిన 3ణ మ్యాప్‌ను రూపొందిస్తాయని డేవిడ్ హోల్జ్ వివరించారు. ఈ సాంకేతికతలో అత్యంత ఆకర్షణీయమైన అంశం భద్రత. సాధారణ ఎంఆర్ఐల మాదిరిగా అయస్కాంత క్షేత్రాలు లేదా సీటీ స్కాన్ల మాదిరిగా రేడియేషన్‌ను ఇది ఉపయోగించదు. కేవలం ధ్వని తరంగాలు, నీటితోనే స్కానింగ్ జరుగుతుంది. దీంతో రేడియేషన్ ప్రమాదం ఉండదని కంపెనీ చెబుతోంది. అంతేకాకుండా ఎంఆర్ఐ పరీక్షలకు 30 నుంచి 90 నిమిషాల వరకు సమయం పట్టగా, ఈ స్కానర్ కేవలం ఒక నిమిషంలోనే ప్రక్రియను పూర్తి చేయగలదు. అయితే ఈ పరికరం ప్రస్తుతం అభివృద్ధి ప్రారంభ దశలోనే ఉంది. ఇంకా వైద్యపరంగా పూర్తిస్థాయి ధృవీకరణ పొందలేదు. రోగనిర్ధారణ కోసం వినియోగించాలంటే అమెరికా ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ (FDA) అనుమతి అవసరం. వచ్చే ఏడాది శాన్‌ఫ్రాన్సిస్కోలో తొలి "మిడ్‌జర్నీ స్పా"ను ప్రారంభించి ఈ స్కానర్లను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కంపెనీ యోచిస్తోంది. భవిష్యత్తులో పూర్తి శరీర స్కానింగ్‌ను సాధారణ ఆరోగ్య పరీక్షగా మార్చడమే తమ లక్ష్యమని సంస్థ వెల్లడించింది.

# కిడ్నీలు ఫెయిల్ అవ్వడానికి ముందు శరీరం ఇచ్చే 5 ముఖ్య సంకేతాలు ఇవే.. పొరపాటున కూడా నిర్లక్ష్యం చేయకండి!



సైలెంట్ కిల్లర్‌గా మారుతున్న మూత్రపిండాల వ్యాధి..

మానవ శరీరంలో పేరుకుపోయే వ్యర్థాలను, అదనపు ద్రవాలను వడపోసి రక్తాన్ని శుద్ధి చేయడంలో మూత్రపిండాలు (కిడ్నీలు) కీలక పాత్ర పోషిస్తాయి. అయితే ప్రస్తుత కాలంలో కిడ్నీ సంబంధిత వ్యాధులు వేగంగా పెరుగుతున్నాయి. ఈ వ్యాధుల అత్యంత ప్రమాదకరమైన లక్షణం ఏమిటంటే, ఇవి ప్రారంభ దశలో ఎలాంటి స్పష్టమైన లక్షణాలను చూపించవు. వ్యాధి తీవ్రరూపం దాల్చే వరకు చాలా మంది దీనిని గుర్తించలేరు. అయినప్పటికీ, కిడ్నీల పనితీరు దెబ్బతినడానికి ముందు శరీరం కొన్ని ప్రాథమిక సంకేతాలను ఇస్తుంది. వాటిని సకాలంలో గుర్తించి వైద్యులను సంప్రదించడం ద్వారా ప్రాణాంతక పరిస్థితుల నుండి బయటపడవచ్చు. మానవ శరీరం సజావుగా సాగడానికి అవయవాల పనితీరు ఎంతో ముఖ్యం. అందులోనూ శరీరంలోని రక్తాన్ని నిరంతరం వడపోస్తూ, విష పదార్థాలను , అదనపు నీటిని మూత్రం రూపంలో బయటకు పంపే ప్రధాన బాధ్యత మూత్రపిండాలదే. వీటితో పాటు శరీరంలో ఎలక్ట్రోలైట్ల సమతుల్యతను కాపాడటంలో కూడా ఇవి కీలక పాత్ర పోషిస్తాయి. అయితే, కిడ్నీలు దెబ్బతినడం ప్రారంభించినప్పుడు ఆ ప్రభావం మొత్తం శరీరంపై పడుతుంది. కిడ్నీ వ్యాధుల బారిన పడే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నప్పటికీ, ప్రారంభంలో ఈ వ్యాధి తీవ్రత బయటకు తెలియకపోవడం వల్ల చాలా మంది ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. నేషనల్ కిడ్నీ ఫౌండేషన్ నివేదిక ప్రకారం, మూత్రపిండాల వైఫల్యానికి ముందు శరీరం పంపే 5 ప్రధాన సంకేతాలను సకాలంలో గుర్తించడం ద్వారా కిడ్నీలను సురక్షితంగా కాపాడుకోవచ్చు. ఆ ముఖ్యమైన సంకేతాల వివరాలు ఇక్కడ చూద్దాం. కిడ్నీలు దెబ్బతినే ముందు కనిపించే 5 ప్రధాన సంకేతాలు నిరంతర అలసట , నీరసం: ఎలాంటి శారీరక శ్రమ చేయకపోయినా రోజంతా విపరీతమైన అలసట, నీరసం ఆవరించడం కిడ్నీ సమస్యకు తొలి సంకేతం కావచ్చు. మూత్రపిండాలు రక్తాన్ని సరిగ్గా శుద్ధి చేయలేనప్పుడు శరీరంలో విషపదార్థాలు (టాక్సిన్స్) పేరుకుపోవడం మొదలవుతుంది. దీనికి తోడు కిడ్నీల పనితీరు మందగించడం వల్ల రక్తహీనత (అనీమియా) ఏర్పడి, శరీరం శక్తిని కోల్పోయి నిరంతరం బలహీనంగా మారుతుంది. శరీర భాగాలలో వాపులు: శరీరంలో పేరుకుపోయే అదనపు ద్రవాలను బయటకు పంపడం కిడ్నీల ముఖ్య విధి. ఈ ప్రక్రియకు ఆటంకం కలిగినప్పుడు శరీరంలో నీరు పేరుకుపోతుంది. ఫలితంగా పాదాలు, చీలమండలు, చేతులు , ముఖం వాపునకు గురవుతాయి. ముఖ్యంగా ఉదయం నిద్రలేచిన వెంటనే కళ్ల చుట్టూ విపరీతమైన వాపు కనిపించడం మూత్రపిండాల లోపాన్ని సూచిస్తుంది. మూత్రవిసర్జనలో మార్పులు: కిడ్నీల ఆరోగ్యానికి సంబంధించిన మార్పులు మొదట మూత్రవిసర్జనలోనే కనిపిస్తాయి. తరచు మూత్రానికి వెళ్లాల్సి రావడం, ముఖ్యంగా రాత్రి వేళల్లో ఎక్కువసార్లు నిద్రలేవడం, మూత్రం పోసేటప్పుడు విపరీతంగా నురుగు రావడం దీనికి ప్రధాన సంకేతాలు. అలాగే మూత్రం రంగులో మార్పులు రావడం లేదా మూత్రవిసర్జన సమయంలో తీవ్రమైన ఇబ్బంది కలగడం వంటివి జరిగితే వెంటనే అలర్ట్ అవ్వాలి. చర్మం పొడిబారడం , దురద: రక్తం నుండి వ్యర్థాలను కిడ్నీలు సరిగ్గా వడపోయలేనప్పుడు, రక్తంలో హానికరమైన పదార్థాల స్థాయిలు విపరీతంగా పెరుగుతాయి. ఈ రసాయనాల ప్రభావం చర్మంపై స్పష్టంగా కనిపిస్తుంది. చర్మం విపరీతంగా పొడిబారడం, శరీరం అంతటా నిరంతరం దురద పెట్టడం లేదా చర్మంపై ఎర్రటి చికాకు వంటి సమస్యలు కిడ్నీల వైఫల్యానికి దారితీసే అంతర్గత మార్పులను బహిర్గతం చేస్తాయి. ఆకలి మందగించడం , వికారం: మూత్రపిండాల పనితీరు మందగించి శరీరంలో విషపదార్థాలు పేరుకుపోయినప్పుడు జీర్ణవ్యవస్థ దెబ్బతింటుంది. దీనివల్ల ఆకలి పూర్తిగా మందగిస్తుంది. కొంతమందికి నిరంతరం వికారం, వాంతులు రావడం లేదా నోరు ఎప్పుడూ చేదుగా, దుర్వాసనతో అనిపించడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఈ ఇబ్బందులు ఎక్కువ కాలం కొనసాగితే ఖచ్చితంగా వైద్య పరీక్షలు అవసరమవుతాయి. ఎవరికి ప్రమాదం ఎక్కువ? ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి? మధుమేహం (షుగర్), అధిక రక్తపోటు (బీపీ), తీవ్రమైన ఊబకాయం ఉన్నవారికి , కుటుంబంలో అప్పటికే ఎవరికైనా కిడ్నీ వ్యాధులు ఉన్న చరిత్ర (ఫ్యామిలీ హిస్టరీ) ఉంటే వారికి మూత్రపిండాల వ్యాధి వచ్చే ప్రమాదం చాలా ఎక్కువగా ఉంటుంది. ఇటువంటి వారు ఎలాంటి లక్షణాలు లేకపోయినా క్రమం తప్పకుండా ప్రతి ఏటా ముందస్తు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ఉత్తమం.